# ఒంటి గంట రాక్షసి

## వీరాంజనేయులు చయనం

"అంతా పరంధాముడు చేశాడు"

స్వగతం అనుకున్నా పైకి అనేశాను.

"ఏం చేశాడు" ఎదురు బెర్త్ మీదున్న జీన్స్‌ప్యాంట్ అమ్మాయి అడిగింది.

"నన్ను బకరా చేశాడు"

"పరంధాముడు అంటే భగవంతుడు కాదా?"

"నా మిత్రుడు. నన్ను ట్రైన్ ఎక్కించడానికి వచ్చాడు కదా అతనే"

"మీరు బకరా ఎలా అయ్యారు. వివరంగా చెప్పండి. తాతగారూ!"

గౌతమి ఎక్స్‌ప్రెస్ కాకినాడ పొలిమేరలు దాటింది.

"పరంధాముడు వురఫ్ పరంధామయ్య నా చిన్ననాటి స్నేహితుడు. కాకినాడలో వుంటాడు. అతని మనవడి పెళ్ళి నిన్న కాకినాడలో జరిగింది. నేను హైదరాబాద్ నుండి వచ్చి ఈరోజు తిరుగు ప్రయాణమయ్యాను"

"ఇందులో బకరా అవటం ఏముంది"

"నా వయస్సు ఎనిమిది పదులు. మధ్యాహ్నం భోజనం అయ్యాక రెండు గంటలు నిద్ర తప్పని సరి. పరంధాముడు నన్ను, నిన్న మధ్యాహ్నం, రాత్రి, ఈరోజు మధ్యాహ్నం నిద్రపోనియ్యలేదు. అతను నిద్రపోలేదు"

"విషయం చెప్పండి. తాతగారూ!"

"విశేషం ఏమంటే పరంధాముడూ నిద్ర ఆపుకోలేడు. పెళ్ళి వేడుకలు ఆసాంతం చూడాలని అంటాడు. పెళ్ళిలో మాలాంటి ముసలివాళ్ళను ఎవరు పట్టించుకుంటారు? నాతో కబుర్లు చెబుతూ, తను నిద్రపోకుండా, నా నిద్ర చెడగొట్టి మూడు పూటలు నన్ను బకరా చేశాడు"

"స్నేహితుడి మనవడి పెళ్ళి వేడుకలు మూడు పూట్లా ఆనందంగా చూశారు కదా? ఇందులో బకరా అవటం ఏముంది?"

"పరంధాముడు నిద్ర ఆపుకోలేడన్న విషయం తాజాగా తెలిసిందమ్మా! వివాహానికి హాజరయినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ... నిన్ను బకరా చేసినందుకు ఏమీ అనుకోకు అన్నాడు"

ఆ అమ్మాయి లగేజి తన లోయర్ బెర్త్ క్రిందకు సర్దేసింది.

"ఏమిటి తాతగారు అలా చూస్తున్నారు? నా అందానికి డంగయ్యారా?"

"డంగ్ కాలేదు. యంగ్ కాలేదు. కాని... ఎర్రంచు పసుపు పచ్చని పట్టు పావడా... చిలకపచ్చ ఓణీ... ఎంత అందంగా వుంటావో అని ఆలోచిస్తున్నా!"

"మీ మనవడికి ఇచ్చి పెళ్ళి చేస్తారా?"

"అర్జీ పెట్టు... ఆలోచిస్తాం..." ఆ అమ్మాయి సరదాగా మాట్లాడుతుంటే... గలగలా నవ్వుతుంటే ముచ్చటగా వుంది. నా నిద్రను కొద్దిసేపు వాయిదా వేయటం సబబే అనిపించింది. గౌతమి రాజ మండ్రి చేరింది. మిడిల్ బెర్త్‌లు వేశారు. గోదావరి దాటితే తూర్పు నుంచి వచ్చిన రైలు పశ్చిమంలో అడుగిడు తుంది. రాత్రి పది గంటలైంది. సైడ్ లోయర్ బెర్త్‌లో ఒక జీన్స్‌ప్యాంట్ కుర్రాడు వున్నాడు.

"లోయర్ బెర్త్ ఇస్తాను, సైడ్ లోయర్ బెర్త్ ఇస్తారా?" ఆ అమ్మాయి అడిగింది.

ఆ కుర్రాడు అంగీకరించడమే తడవుగా, ఆ అమ్మాయి సైడ్ లోయర్ బెర్త్ రెండవ సీట్‌లో వెళ్ళి కూర్చుంది.

ఆ అబ్బాయి తన పరిచయం చేసుకున్నాడు.

"నేను సాఫ్ట్‌వేర్"

"నేనూ సాఫ్ట్‌వేర్" వాళ్ళ సంభాషణ అనంతంగా సాగుతోంది. మూడు పూటలు నిద్రలేని నాకు వాళ్ళ సంభాషణ ఇబ్బందిగా మారింది. మిగతా బెర్త్‌ల వాళ్ళు ఇటూ అటూ మసలుతున్నారు. ఎవరూ వాళ్ళను నిశ్శబ్దంగా వుండమని చెప్పలేదు. నేను చెడ్డవాణ్ణికావటం నాకూ ఇష్టం లేదు. మాగన్నుగా నిద్రపడుతోంది.

"తాతగారూ"ఆ అమ్మాయి నన్ను నిద్రలేపుతోంది.

"ఏమిటమ్మా! నిద్ర చెడగొట్టావు?"

"మీరు పలవరిస్తున్నారు. 'పింద్రాప్ సైలెన్స్' అంటున్నారు. పీడకల వచ్చిందేమో అని నిద్రలేపాను. పీడకలలు వస్తున్నాయేమో అని అనుమానం వస్తే...నిద్రలేపి...మంచి నీళ్ళు ఇచ్చి... మంచి విషయం వైపు మనసు మళ్ళించాలి అని మా అమ్మమ్మ చెప్పింది" వాటర్ బాటిల్‌లో నీళ్ళు త్రాగాను. "మంచి విషయం కూడా చెబుతావా?"

"చెప్పాను కదా..."

"ఏమిటి?"

"మా అమ్మమ్మ అందంలో నాకు సగమే వచ్చిందంటారు. ఇక మీరు అందమైన కలలుకంటూ నిద్రపొండి"

"అల్లరి పిల్ల"

"మీకు అందంగా తిట్టడం రాదా?"

"రాదు కానీ... ఇక పడుకో..." ఇంతకీ సైడ్ లోయర్ బెర్త్ అబ్బాయి ఏడి?"

"ముఖం కడుక్కోవటానికి వాష్ బేసిన్ దగ్గరకు వెళ్ళాడు. ఇప్పటికి చాలాసార్లు వెళ్ళాడు"

"టైము ఎంతయ్యింది"

"ఒంటిగంట అవుతున్నది. విజయవాడు వస్తున్నది"

లోయర్ బెర్త్ క్రింద వున్న తన లగేజీ తీసుకున్నంది.

"వెళ్ళొస్తా... తాతగారూ... స్వీట్ డ్రీమ్స్"

"హైదరాబాద్ రావటంలేదా?"

"నేను విజయవాడలోనే దిగాలి. నిద్రపట్టిందా... హైదరాబాద్‌లో వుంటా. అందుకే... నిద్ర ఆపుకోవటానికి ఆ అబ్బాయితో కబుర్లు"

"తప్పు కదూ! ఆ అబ్బాయికి నీ వివరాలు చెప్పావా?"

"కంగారు లేదు. అన్నీ ఆఫ్ ట్రూత్స్"

"ఇంత కొంటె పిల్లవు అనుకోలేదు"

"మీకు అందంగా తిట్టడం రాదా?"

"ఇంతకుమించి అందంగా తిట్టడం రాదు. అందంగా తిట్టడం ఎట్లాగో చెప్పరాదూ?"

"అందం ట్రిఫిక్స్‌గా వుండాలి. ఉదాహరణకు అందాల రాక్షసివే! అని తిట్టొచ్చు"

"అంత పాండిత్యం నాకు లేదు"

రైలు విజయవాడ స్టేషన్‌లో ఆగింది.

"ఆ బకరా వస్తున్నాడు. మీరూ పడుకోండి. వాడికి సారీ చెప్పి దిగుతాను"

"సారీలు చెప్తమ్మా?"

"మీకు థ్యాంక్స్... బకరా ఐడియా ఇచ్చినందుకు"

ఆ పిల్ల బై... బైలు చెప్పి రైలు దిగింది.

గడియారంలో గంట ఒంటిదయ్యింది. *